





తిరుగులేని తిరునగరి

ఆధ్యాత్మిక క్షేత్రంగా తిరుపతి కీర్తి గడించింది. కలియుగ వైకుంఠంగా జగద్విఖ్యాతి పొందింది. ఈ క్రమంలోనే స్మార్ట్ సిటీగా అవతరించింది. విద్యారంగంలో విశిష్ట విశ్వవిద్యాలయాలతో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తోంది. అత్యుత్తమ వైద్య కళాశాలలతో విశేష సేవలు అందిస్తోంది. అత్యాధునిక సదుపాయాలతో వేలాది మందికి ఉసురుపోస్తున్న ఉన్నత ఆస్పత్రులకు నిలయంగా విలసిల్లుతోంది. దేశంలోని ప్రముఖ నగరాలకు దీటుగా ప్రజలు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకునే వెసులుబాటు కల్పిస్తోంది. మాస్టర్ ప్లాన్ కింద నిర్మించిన విశాలమైన రహదారులతో రాకపోకలను సులభతరంగా మార్చేసింది. ఈ మేరకు రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి బాటలు వేసింది. అందులో భాగంగా పెద్దసంఖ్యలో వెలసిన అపార్ట్‌మెంట్లతో తిరునగరం అత్యంత సుందరంగా తయారైంది.



- ఎడ్యుకేషనల్ హబ్‌గా తిరుపతి
- 'మాస్టర్ ప్లాన్'తో పుంజుకున్న రియల్ వ్యాపారం
- అత్యాధునిక ఆస్పత్రులతో విరాజిల్లుతున్న ఆరోగ్య కేంద్రం
- 'స్మార్ట్'గా పారిశ్రామిక రంగంలో పరుగులు
- మెట్రో నగరాలకు దీటుగా మౌలిక వసతులు

తిరుపతి అర్బన్ : ప్రతిష్ఠాత్మక తిరుపతి లక్షలాది మందికి ఆశ్రయమిస్తోంది. వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తూ వేలాది మందికి ఉపాధి అవకాశాలను అందిస్తోంది. ప్రధానంగా దేశంలోనే ఏ నగరంలో లేనన్ని యూనివర్సిటీలు నగరంలో ఏర్పాటయ్యాయి. శ్రీవేంకటేశ్వర, పద్మావతి మహిళా వర్సిటీ, వేదిక్ వర్సిటీ, జాతీయ సంస్కృత వర్సిటీ, వెటర్నరీ వర్సిటీ, తదితర విశ్వవిద్యాలయాలతో అనంత కీర్తి గడించింది. అలాగే రాయలసీమకే తలమానికంగా నిలిచే రుయా, ఆధునిక వసతులతో స్విమ్స్ ఆస్పత్రులు నిత్యం వందలాది మందికి ఉసురు పోస్తున్నాయి. అలాగే శ్రీపద్మావతి చిన్నపిల్లల హాస్పిటల్‌లో గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఇప్పటికే పదుల సంఖ్యలో విజయవంతంగా హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు పూర్తి చేయడం విశేషం. ఈక్రమంలోనే బర్డ్ ఆస్పత్రి సేవలు అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందాయి. అలాగే టాటా ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో నిరుపేద రోగులకు సైతం ఉత్తమ వైద్యం అందిస్తున్నారు. అరవింద్ నేత్రాలయంలో అద్భుతంగా చికిత్సలందిస్తున్నారు. ఇలాంటి విశిష్ట ఆస్పత్రుల సమాహారంగా తిరుపతి దేశంలో మహా నగరాలుగా గుర్తింపు పొందిన హైదరాబాద్, బెంగళూరు, చెన్నై సిటీలకు దీటుగా పేరు ప్రతిష్ఠలు పొందింది. ఈ క్రమంలోనే తిరుపతి నగరంలో మాస్టర్ ప్లాన్ కింద రూపొందించి రహదారులు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగానికి ఊపిరిపోశాయి. దీంతో పలు ప్రాంతాల్లో ఇబ్బడి ముబ్బడిగా అపార్ట్‌మెంట్లు వెలిశాయి. నగరంలో ప్రజలకు ఆధునిక వసతులతో నివాసాలను అందుబాటులోకి తీసుకువచ్చాయి. అలాగే తిరుపతిలో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పించేందుకు నిర్మించిన గరుడ వారధి సైతం నగరానికి తలమానికంగా నిలుస్తోంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కారణంగా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తిరునగరి ఖ్యాతి ఇనుమడిస్తోంది. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్మార్ట్‌సిటీలో భాగంగా నిర్మిస్తున్న తుడా టవర్స్ త్వరలోనే తిరుపతికి మరింత ఆకర్షణ తీసుకురానున్నాయి. అలాగే అత్యాధునిక వసతులతో రూపొందించి కచ్చడి ఆడిటోరియం సైతం ఆకట్టుకుంటోంది.


టాటా క్యాన్సర్ ఆసుపత్రి

రియల్ ఎస్టేట్‌లో నక్షత్ర బిల్డర్స్ ప్రత్యేకత



తిరుపతి నగరంలో రియల్ ఎస్టేట్ రంగంలో దశాబ్ద కాలం అనుభవం కల్గిన నక్షత్ర బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ... ప్రపంచస్థాయి సౌకర్యాలతో నూతనంగా కాసా గ్రాండే ప్రారంభించింది. వాస్తు, వెంటిలేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ...పార్క్, జిమ్, స్విమింగ్‌పూల్, మెడికల్, అంబులెన్స్ తదితర సౌకర్యాలతో సుమారు 1.5 ఎకరాలు స్థలం కేటాయించి అత్యాధునికంగా మేటి నగరాలకు దీటుగా నిర్మాణాలు చేపడుతున్నాం. ఈ అపార్ట్‌మెంట్స్‌ను మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా సరసమైన ధరలతో అందిస్తున్నాం.


– భరత్‌కుమార్‌రెడ్డి

అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నాం

ఎడ్యుకేషనల్ హబ్‌గా ప్రసిద్ధి చెందిన తిరుపతి నగరంలో యువతి, యువకులకు అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నాం. మా ఎస్ఆర్ డిఫెన్స్ అకాడమీ ద్వారా ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీ, ఇండియన్ ఎయిర్ పోర్స్‌లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తున్నాం.

– శంకర్‌రెడ్డి

ఎలక్ట్రానిక్స్ రంగంలో అనుభవం



గృహోపకరణాల వ్యాపారంలో 38 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. తిరుపతి కర్నాలవీధిలోని మా ఎస్వీ డిజిటల్స్‌లో నాణ్యమైన వస్తువులను విక్రయిస్తున్నాం., నమ్మకమైన సర్వీసును ప్రజలకు అందిస్తున్నాం. అలాగే ప్రతి పండుగకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నాం. వినియోగదారులకు సంక్రాంతి సందర్భంగా గృహోపకరణాలపై ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నాం.

– మోహన్‌కుమార్ రాజు

పోరాటవీరుడు వడ్డె ఓబన్న

చిత్తూరు కలెక్టరేట్: వడ్డె ఓబన్న పోరాట వీరుడని జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీ బాషా కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వడ్డె ఓబన్న తొలి స్వాతంత్ర్య సమరయోధుడని చెప్పారు. దేశం కోసం ప్రాణాలు లెక్క చేయని ధీరుడు అని చెప్పారు. వడ్డె ఓబన్న భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గణనీయమైన పాత్రను పోషించిన ముఖ్యమైన వ్యక్తి అని అన్నారు. కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ మాట్లాడుతూ వడ్డె ఓబన్న దాదాపు 9వేల మంది సైనికులతో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం మొదలు పెట్టారని తెలిపారు. రైతుల హక్కులను రక్షించడానికి, వారి న్యాయం కోసం పోరాడరన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అట్లూరి శ్రీనివాసులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పుంగనూరు: పట్టణంలోని ఆంజనేయస్వామి గుడివీధిలో నివాసం ఉన్న ఒంటరి మహిళ కుమారమ్మ(56) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. శనివారం కుమారమ్మ ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా కూలీ పనులు చేసుకుంటూ జీవించే కుమారమ్మ ఎప్పుడు, ఎలా చనిపోయిందన్న విషయాలు పోలీసులు దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది. ఈ మేరకు సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు ఇంటిని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎర్రచందనం స్వాధీనం

చిత్తూరు అర్బన్: నగరంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న ఓ వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఇరువారం కూడలి వద్ద టూటౌన్ ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో చిత్తూరు వైపు వస్తున్న వ్యక్తులు, పోలీసులను చూసి కారు వదిలి పారిపోయారు. పోలీసులు కారును పరిశీలించగా పది ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. కారుతోపాటు, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పవిత్రం.. పునీతం

- ఘనంగా ద్వాదశి వేడుకలు
- కల్యాణ వేంకటేశ్వరునికి విశేష పూజలు
- తిరుచానూరులో శాస్త్రోక్తంగా చక్రస్నానం

చంద్రగిరి : వైకుంఠ ద్వాదశి సందర్భంగా టీటీడీ అనుబంధ ఆలయాల్లో శనివారం ద్వాదశి వేడుకలు నిర్వహించారు. శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను సమర్పించారు. అనంతరం దేవదేవేరులను వజ్రవైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించారు. తదుపరి చక్రతాళ్వార్‌ను ఊరేగింపుగా ఆలయ పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. కనుల పండువగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం సుమూహూర్తంలో స్వామి, అమ్మవార్ల ఆలయ పుష్కరిణి వద్ద చక్రతాళ్వార్‌కు శాస్త్రోక్తంగా చక్రస్నానం చేపట్టారు.



తిరుచానూరు అమ్మవారి పుష్కరిణిలో వేడుకగా చక్రస్నానం


శ్రీనివాసమంగాపురంలో చక్రస్నాన ఘట్టం నిర్వహిస్తున్న దృశ్యం


శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు


పుష్కరిణి వద్ద చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు


తిరుచానూరు పద్మసరోవరం వద్ద చక్రతాళ్వార్‌కు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

'రాయల' రాజసం!

- గత వైభవ చిహ్నంగా చంద్రగిరి కోట
- ఆకట్టుకుంటున్న పురాతన ఆనవాళ్లు
- నిత్యం వందలాదిగా తరలివస్తున్న సందర్శకులు


రాయలవారి కోట (ఫైల్‌ఫోటో)

చంద్రగిరి : విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీకృష్ణదేవరాయల వారి వైభవానికి చిహ్నంగా చంద్రగిరి కోట నిలిచిపోయింది. నాటి కాలంలో రాయలవారు చంద్రగిరిని రెండో రాజధానిగా చేసుకుని పరిపాలన సాగించినట్లు ఆధారాలున్నాయి. రాజులు, రాజ్యాలు పోయినా.. ఇప్పటికీ వారు అందించిన జాతి సంపద మాత్రం కనులకు కట్టినట్లుగా నిలిచి ఉంది.

ఆసక్తికర అంశాలెన్నో!

పర్యాటక స్థలాల్లో రాజప్రసాదాలకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. అలనాటి అద్భుత శిల్ప సౌందర్యం , పురాతన వస్తువులు... ఇలా ఒక్కటేమిటి ? ఔత్సాహికులకు కావాల్సినంత ఆసక్తికర అంశాలెన్నో చంద్రగిరి కోటలో దర్శనమిస్తున్నాయి. విజ్ఞానంతో పాటు ఆసక్తిని పెంచే చరిత్ర ఆనవాళ్లు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

చారిత్రక నేపథ్యం ఇదీ..

నారాయణవనం రాజు ఇమ్మడి యాదవ నరసింహరాయులు క్రీ.శ. 1000లో చంద్రగిరి కోటను నిర్మించాడు. అనంతరం క్రీ.శ.1314లో చంద్రగిరి కోట యాదవ రాజుల అధీనంలోకి వచ్చింది. తదనంతర కాలంలో శ్రీకృష్ణదేవరాయలవారి ఆధీనంతోకి చంద్రగిరి కోట చేరుకుని దక్షిణ భారతావనిలో ప్రధాన నగరంగా విరాజిల్లింది.

చేరుకోవడం ఇలా..

తిరుపతి నుంచి చంద్రగిరికి 14 కిలోమీటర్లు, ప్రతి పదినిమిషాలకు ఒక బస్సు ఉంది. అలాగే నిత్యం ట్యాక్సీలు, ఆటోలు అందుబాటులో ఉన్నాయి.



ఆకట్టుకునేవి ఇవీ..

రాయలవారికోట, రాణీమహల్, బోటింగ్, లైటింగ్‌షో (ప్రస్తుతం ఆగిపోయింది), ఆహ్లాదకర వాతావరణం, ఉద్యానవనం, పురాతన వస్తు ప్రదర్శన, కోట, ప్రాకారం పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటాయి.


అలనాడు రాజులు వాడిన ఆయుధాలను కోటలో ప్రదర్శనంగా ఉంచిన దృశ్యం

క్లుప్తంగా

తిరుచ్చిపై శ్రీకృష్ణుని విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణ స్వామివారు, అమ్మవార్లతో కలసి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ, సత్యభామ సమేతంగా శ్రీకృష్ణుడు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో విహరించారు. కార్యక్రమంలో ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్ కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

హిందూ వాహిని జిల్లా కమిటీ ఎంపిక



నియామక పత్రాలు అందజేస్తున్న సంఘటన ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రుద్రరాజు శ్రీదేవి తెలిపారు. ఈమేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా హేమలత, ఉపాధ్యక్షులుగా సు నంద, కార్యవర్గ సభ్యులుగా హేమంత్ రాజు ,మనోహర్ యాదవ్‌ను నియమించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధిగా శ్యామలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు సంఘటన ప్రతినిధులు సుకుమార్, రుద్రరాజు శ్రీదేవి, సంగరాజు అశ్విని నియామక పత్రాలు అందజేశారు. వీరనాగమల్లయ్య, శంకర్‌రాజు పాల్గొన్నారు.

ఎస్పీ బదిలీ రద్దుకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : తిరుపతి ప్రశాంతత కోసం నిరంతరం శ్రమించిన ఎస్పీ సుబ్బరాయుడిని బదిలీని రద్దు చేయాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కిరణ్ కుమార్, రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపకుడు, దక్షిణ భారత బలిజ సమాజం నేత రెడ్డి శేఖర్ రాయల్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు వేర్వేరుగా మాట్లాడారు. వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనం టిక్కెట్ల జారీ కేంద్రంలో తొక్కిసలాటతో ఆరుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. అయితే ఇందుకు ఎస్పీని బాధ్యుడిని చేసి బదిలీ చేయడం సరికాదని తెలిపారు. భక్తుల మృతికి కారణం టీటీడీ వైఫల్యమే అని ఆరోపించారు. ప్రభుత్వం పునరాలోచించి ఎస్పీ బదిలీని నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

బాలసుబ్రమణ్యానికి డాక్టరేట్



తిరుపతి సిటీ : తిరుపతికి చెందిన సింగిరి బాల సుబ్రమణ్యానికి చెన్నైకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాజకీయాలలో నైతిక విలువలను అనుసరిస్తూ, ఆయన చేస్తున్న సామాజిక సేవాల కార్యక్రమాలను గుర్తించి పురస్కారం డీ ప్రదానం చేసినట్లు వర్సిటీ వీసీ జస్టిస్ వెంకటేశన్ తెలిపారు. తమిళనాడు రాష్ట్ర పిన్సిపల్ సెక్రటరీ సంపత్‌కుమార్, వర్సిటీ చాన్సలర్ డాక్టర్ పి.మాన్యుల్ చేతుల మీదుగా బాలసుబ్రమణ్యం డాక్టరేట్ అందుకున్నారు

చిరుత సంచారంపై అప్రమత్తం



వర్సిటీలో శునకాలకు ఆహారం అందిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిసరాల్లో చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు. వర్సిటీ ప్రాంగణంలో సాయంత్రం 6 నుంచి ఉదయం 6గంటల వరకు ఒంటరిగా సంచరించకూడదని కోరారు. వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా నియంత్రించాలన్నారు. ప్రధానంగా వీధి శునకాలు అధికంగా వర్సిటీ ప్రాంగణంలో ఉండడం వల్లే చిరుత వాటికోసం వస్తోందని వివరించారు. కొందరు శునకాల సంరక్షణ పేరుతో బయట నుంచి ఆహారం తీసుకువచ్చి కుక్కలను అందిస్తున్నారని, అలాంటి పనులను వెంటనే నిలిపివేయాలని స్పష్టం చేశారు. త్వరలో చిరుతకోసం బోన్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. చిరుత జాడ కనిపించిన వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు

బైక్ కొనేందుకు వెళితే ఫోన్ కొట్టేశారు!

పాకాల : బైక్ కొనేందుకు వెళితే సెల్‌ఫోన్ కొట్టేసిన ఘటన స్థానిక చిత్తూరు రోడ్డులోని ఓ టూవీలర్ కంపెనీ షోరూమ్‌లో జరిగింది. వివరాలు.. భారతంమిట్టకు చెందిన పి.వినోద్‌బాబు తన భార్యతో కలసి శుక్రవారం మధ్యాహ్నం బైక్ కొనేందుకు ఓ టూవీలర్ షోరూమ్‌కు వెళ్లాడు. టెస్ట్ డ్రైవ్‌కు భార్యాభర్తలు బైక్‌పై వెళ్లారు. ఈ క్రమంలో వినోద్‌బాబు తన సెల్‌ఫోన్‌ని షోరూమ్‌లోని టేబుల్‌పై ఉంచి వచ్చేశాడు. టెస్ట్ డ్రైవ్ ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత చూస్తే సెల్‌ఫోన్ అక్కడ లేదు. సిబ్బంది తమకు తెలియదని చెప్పడంతో పోలీసులను ఆశ్రయించాడు.

ఇసుకపై ఉత్తుత్తి మాటలేనా?

- ఐదు నెలలుగా ఉచిత ఇసుక ఊసేలేదు



ఇసుక విధానంపై సమావేశమైన అధికారులు (ఫైల్)



కలెక్టరేట్‌లో గత ఏడాది నవంబర్ 15న నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు(ఫైల్)

తిరుపతి అర్బన్: జిల్లాలో ఉచిత ఇసుక ప్రక్రియను నిలుపుదల చేసి నాలుగు నెలలు గడుస్తోంది. గత ఏడాది జూలై 8వ తేదీన ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం వెలుగులోకి తెచ్చింది. అయితే జూలైతో పాటు ఆగస్టు వరకు తూతూమంత్రంగా ఇసుక పాలసీని కొనసాగించారు. ఆ తర్వాత ఇసుక లేదని సెప్టెంబర్ నుంచి జనవరి ఐదు నెలలపాటు ఈ ప్రక్రియను అటకెక్కించారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెప్పినప్పటికీ వెంకటగిరి పరిధిలోని మెగ్గళ్లగుంటలో టన్ను రూ.590కి, సూళ్లూరుపేట పరిధిలోని మావిళ్లపాడులో టన్ను రూ.465కి, సత్యవేడు పరిధిలోని పిచ్చాటూరులో టన్ను రూ.200కి, నాగలాపురంలో టన్ను రూ.200కు ఇరవై రోజులు పాటు మాత్రమే అందించారు. ఆ తర్వాత నుంచి ఇసుక కష్టాలు మొదలయ్యాయి.

డిసెంబర్‌లో 24 సమావేశంలో..

గత డిసెంబర్ 24న కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కోట మండలంలోని గూడలి గ్రామ సమీపంలో స్వర్ణముఖి బ్యారేజీ వద్ద ఒక పాయింట్, అలాగే పెళ్లకూరు మండలంలోని పాలచూరు, పుల్లూరు గ్రామాల వద్ద రెండు ఇసుక పాయింట్లు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఈ మూడు ఇసుక స్టాక్ పాయింట్ల ద్వారా 1,37,686 మెట్రిక్ టన్నులు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. అయితే ఇప్పటికీ అతీగతీ లేదు.

గత నవంబర్‌లో 15 సమావేశంలో..

గత నవంబర్ 15న కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవంబర్ 30 నుంచి జిల్లాలో మూడు పాయింట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. నవంబర్ 30 నుంచి ఆయా పాయింట్ల ద్వారా 1,37,686 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఆ తర్వాత ఆ ఊసేలేకుండా పోయింది.

బాబు కన్నా పవన్ కల్యాణ్ బెటర్

– ఎంపీ మిథున్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమలలో ముక్కోటి ఏకాదశికి వచ్చిన భక్తులకు జరిగిన నష్టం ఊహించలేనిదని, ఇందుకు క్షమాపణలు చెబితే సరిపోదని.. ముఖ్యమంత్రి చంద్రబాబు కన్నా పవన్‌కల్యాణ్ ఎంతో బెటర్ అని, ఆయన తప్పులు ఒప్పుకున్నారని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి తెలిపారు. శనివారం మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పతో కలసి పుంగనూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవిత్రమైన క్షేత్రంలో జరిగిన తొక్కిసలాటకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఘటన వెనుక కుట్రలు ఉన్నాయంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేయడం బాధాకరమన్నారు. తిరుమల సంఘటనపై నామమాత్రంగా చర్యలు తీసుకుని వదలరాదన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయి, గాయపడితే కేవలం క్షమాపణలు చెబితే భక్తులకు జరిగిన నష్టం తీరిపోతుందా..? సారీలు చిన్నవాటికే చెప్పాలని, ప్రతి దానికీ సారీలు చెప్పి సమస్యలను దాట వేయడం మంచిదికాదన్నారు. భవిష్యత్‌లో తిరుమల భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా టీటీడీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



భోగి మంటలు వేసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు

రామచంద్రాపురం: మండలంలోని వెంకట్రామాపురం సమీపంలో గల సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంట వేశారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఫర్ అకడమిక్స్ ప్రొఫెసర్ లక్ష్మయ్య మాట్లాడుతూ భోగి భోగభాగ్యాలకు, సంక్రాంతి మన పెద్దలను తలచుకోవడానికి, కనుమ పశువులను అలంకరించి పూజలు చేసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రసన్నరాజు, అకడమిక్ డైరెక్టర్ శరవణ కుమార్ పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్యం జగన్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటుచేశారని మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టంచేశారు. శనివారం ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పతో కలసి పుంగనూరులో వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగాలకు దాదాపు 26 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే పారదర్శకంగా అర్హులైన 2.60 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామని, 1.38 వేల మందిని కార్యదర్శులుగా నియమించినట్టు తెలిపారు. సచివాలయాల ద్వారా ప్రజల ముంగిటకు సేవలు అందించారని చెప్పారు. ప్రస్తుతం తెలుగుదేశం పాలనలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యమైందని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ.10 వేల జీతం ప్రకటించి, వారి చేత ఓట్లు వేయించుకున్న చంద్రబాబు వారికి ఉద్యోగాలు లేకుండా చేశారని మండిపడ్డారు. ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చిన సూపర్ 6 పథకాల్లో ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. 3.66 లక్షల మందికి పింఛన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో నష్టపోతున్నది తెలుగుదేశాన్ని గద్దెనెక్కించేందుకు కృషిచేసిన వారే అని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని కారు కలకలం



పార్కు చేసిన కారు

పాకాల : స్థానిక రైల్వేగేటు వద్ద ఫకీర్‌పేట మార్గంలో మూడు రోజులుగా నిలిచి ఉన్న గుర్తు తెలియని కారు స్థానికంగా కలకలం రేపుతోంది. శనివారం ఈ మేరకు గ్రామస్తులు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తి హెచ్ఆర్22ఎస్7032 నంబరు గల కారును పార్కు చేసి హడావుడిగా ఓ బ్యాగు తగిలించుకుని వెళ్లిపోయాడన్నారు. మళ్లీ తిరిగి రాకపోవడంతో పోలీసులకు సమాచారం అందించినట్లు వెల్లడించారు.

16న కనీస వేతనాలపై సదస్సు

తిరుపతి కల్చరల్ : కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ అండ్ వర్క్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ ఈనెల 16వ తేదీన జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ అనుబంధ సంఘాల ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు . ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 3 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నష్టం చేసే జీఓ నంబర్ 2ను సవరించి, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్ రాయల్, నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర నేత లోకేష్‌బాబు, సమగ్ర శిక్ష యూనియన్ నేత ప్రదీప్‌కుమార్, రాజేంద్ర, మురగయ్య, గంగయ్య , సీఐటీయూ నేత జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, వేణుగోపాల్, నాగవెంకటేష్ పాల్గొన్నారు.

'రత్నం'లో సంక్రాంతి సంబరాలు



భోగి మంట వేస్తున్న విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేశవాయనిగుంటలోని రత్నం గ్లోబల్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణాన్ని పచ్చని తోరణాలు, పుష్పాలతో పండుగ వాతావరణాన్ని తలపించేలా అలంకరించారు. భోగి మంటలు వేసి పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంక్రాంతి పర్వదినం విశేషాలను వివరించారు. మన హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి రూపాలు పండుగలని, ప్రతి పండుగను నిర్వహించుకుంటూ భావితరానికి అందించాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎస్.రవి పాల్గొన్నారు.

పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ

తిరుపతి తుడా : నగరంలో పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ ఉండాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా విధించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శనివారం చిన్న బజారు వీధి, ఆకుతోట వీధి, నాదముని వీధి, కొత్త వీధి, కోట కొమ్మల వీధి, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెత్త తీసుకెళ్లే వాహనం ఎన్ని గంటలకు వస్తుంది? మురుగు కాలువల్లో చెత్త తొలగిస్తున్నారా? నీరు ఏ సమయంలో సరఫరా చేస్తున్నారు? నీటి సాంద్రత పరీక్షలు చేస్తున్నారా? అని ప్రజలను ఆరా తీశారు. చిన్న బజారు వీధిలో దుకాణాల ముందు చెత్త వేసి ఉండడం చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాలు మూసిన తర్వాత వేస్తున్నారని సిబ్బంది చెప్పగా, జరిమానాలు విధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

సన్మార్గ గమనమే సంక్రాంతి



పురస్కారాలు అందుకున్న సాహితీవేత్తలు, సంఘ సేవకులు

- ఘనంగా సంక్రాంతి కవనోత్సవం
- ప్రముఖులకు 'మహానంది' పురస్కారాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సంక్రాంతి పర్వదినం మానవాళికి సన్మార్గ గమనమని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగాధిపతి ఆచార్య వి.కృష్ణవేణి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య వై.విజయలక్ష్మి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని రెడ్డిభవన్‌లో శనివారం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య వ్యవస్థాపకులు మత్రిపూడి దేవేంద్రరావు ఆధ్వర్యంలో 'సంక్రాంతి కవనోత్సవం' పేరిట జాతీయ కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ఆచారాలు, సంప్రదాయాలు తెలుగుజాతికి జీవం అన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం తెలుగుశాఖ పోస్టు డాక్టోరల్ కేసీ లావణ్య, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పోస్టు డాక్టోరల్ జి. సుభాషిణి మాట్లాడుతూ ప్రకృతి పరిణామాలు, మానవ సంబంధాలపై చైతన్యాన్ని చాటిచెప్పే పెద్దపండుగ సంక్రాంతి అన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మిద్దెల హరి, లయన్స్ క్లబ్ చిత్తూరుగోల్డ్ అధ్యక్షుడు ఎంపీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాజీవన సంక్షేమాన్ని ప్రసాదించమని సూర్యభగవానుడిని త్రికరణశుద్ధిగా స్తుతించమనే శుభదినం సంక్రాంతి అన్నారు. సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సి. నారాయణస్వామి, సంఘ సేవకులు పి.పార్థసారథి నాయుడు "మాట్లాడుతూ సమాజంలో చెలరేగుతున్న దుర్గుణాలన్నింటినీ భోగిమంటల్లో వేయమంటుంది మన సంక్రాంతి అని చెప్పారు. అనంతరం 50 మందికి 'మహానంది' జాతీయ పురస్కారాలు -2025ను ప్రముఖ సాహితీవేత్త దేవేంద్రరావు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు నందిపాటి చక్రపాణి, ఎ.కోమల, కొఠారి వెంకటరత్నం, జి. శాంతకుమారి, గొడుగుచింత గోవిందయ్య, అనంత పద్మనాభన్, సోము ఉమాపతి, రెడ్డిపల్లి షాజహాన్, ఎస్. మునీంద్ర, తోటగోవిందన్, పాలకూరు పద్మ ప్రపూర్ణ, ఆదివిష్ణు బాలచంద్ర, సంఘసేవకులు బి. కోటీశ్వర మొదలియార్, కె.హరిప్రసాద్ రెడ్డి, జ్ఞానశేఖర్ రెడ్డి, కె. ఆనందనాయుడు, ఎన్. షణ్ముగం,, వి.పవన్, ఎస్. హరిబాబు, డి. రోహితుకుమార్, ఎం. మొహిద్దీన్ అలీ, ఎం.నేతాజీ, విద్యార్థులు ఎస్. శావంత్, భావన, టి. ఎన్. ప్రవళిక, ఎస్. లిఖిత, భువన్ చంద్, పి. దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు మాతృవియోగం



సరస్వతమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని నడవలూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు రాము, వాసుదేవ రెడ్డి తల్లి సరస్వతమ్మ (60) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి సరస్వతమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ గణపతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు యోగానందరెడ్డి, గిరిధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, సతీష్, గంగరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేదంలో 'ఒప్పో ఏ13' ఆవిష్కరణ



మొబైల్‌ను కస్టమర్‌కు అందిస్తున్న వేదం మొబైల్స్ అధినేత ప్రభాకర్

తిరుపతి కల్చరల్ : తిలక్ రోడ్డులోని వేదం మొబైల్స్ షోరూమ్‌లో శనివారం ఒప్పో ఏ13 రెనో సిరీస్‌ను వేదం మొబైల్స్ అధినేత ప్రభాకర్ ఆవిష్కరించారు. తొలి మొబైల్‌ను కస్టమర్ ప్రకాష్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ మొబైల్‌లో అండర్ వాటర్ వీడియో, డ్యూయల్ 50 మెగా పిక్సెల్ కెమెరా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫీచర్స్ ఉన్నాయని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా 10 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ఉందని వెల్లడించారు. 6/0 నుంచి 12/0 వరకు ఫైనాన్స్ సౌకర్యం ఉందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విజేతలు

తిరుపతి కల్చరల్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా భాష్యం బ్లూమ్స్ సీబీఎస్ఈ స్కూల్లో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు పట్టుచీరలను బహుమతిగా అందజేశారు. అంతకు ముందు పాఠశాల్లో చిన్నారులు ప్రదర్శించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

తిరుపతి రూరల్ : బీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. శనివారం తిరుపతిలో విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలను ఆయన ప్రారంభించారు. ఏళ్ల తరబడి బీసీ ఉద్యోగుల పదోన్నతులు, నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిస్కమ్‌ల్లో ఉన్న ఈ సమస్యల పరిష్కారానికి త్వరలో సీఎం చంద్రబాబు, సీఎండీలతో చర్చిస్తామన్నారు. అనంతరం సంఘం డైరీ–2025ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు వీరభద్రయ్య, చలపతి పాల్గొన్నారు.


మట్టివాసన తెలిసిన 'మౌని'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : గ్రామీణ ప్రాంతాల ఆయువుపట్టు తెలిసిన కవి మౌని అని రచయిత, సప్తగిరి పూర్వ సంపాదకుడు సి.శైలకుమార్ తెలిపారు. ఈ తరం కవితా వేదిక, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం యూత్ హాస్టల్లో రచయిత మౌని రచించిన తొలకరి చినుకులు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక సమీక్ష చేసిన శైలకుమార్ మాట్లాడుతూ మట్టిలో విత్తనాలే కాదు మనిషి కూడా మొలకెత్తాలని అనడం లోతైన వాక్యమని పేర్కొన్నారు. మనిషి కూడా చెట్టులా పరోపకారంతో ఉండాలనే సందేశం ఇందులో ఉందని వెల్లడించారు. ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు మాట్లాడుతూ రాయలసీమలో తొలకరి చినుకుల శాస్త్రీయతను వివరించారు. కార్యక్రమంలో రచయిత మౌని, సాహితీవేత్తలు తోట వెంకటేశ్వర్లు, నెమిలేటి కిట్టన్న, మల్లేశ్వరరావు, ఆర్‌సీకే రాజు, మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం పాల్గొన్నారు.


ప్రత్యేక హోదాపై మోదీని ప్రశ్నించాలి



మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి కల్చరల్ : విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ, ప్రత్యేక హోదాపై ప్రధానమంత్రిని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించాలని, అయితే వైజాగ్ సభలో ఆ ప్రస్తావనే తీసుకురాకపోవడం దుర్మార్గమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మండిపడ్డారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఆంధ్రుల మనోభావాలను మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు కోసం అప్పట్లో రైతులు 25 వేల ఎకరాలు త్యాగం చేశారని గుర్తుచేశారు. ఈ రోజు అక్కడ ఎకరా రూ.వంద కోట్లు పలుకుతోందన్నారు. విశాఖ ఉక్కును మోదీ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటకు టీటీడీ, పోలీసు అధికారుల సమన్వయం లోపమే కారణమని స్పష్టం చేశారు. తిరుమల లడ్డూలో గొడ్డు కొవ్వు ఉందని చెప్పడం మహా పాపమని, అందుకు ఫలితమే తిరుపతి దుర్ఘటన అని వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి, రవి, తేజోవతి, మునిశోభ, రావణ్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

పౌర చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడికి పితృవియోగం



చలపతిరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న రచయితలు

తిరుపతి కల్చరల్: పౌర చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు వాకా ప్రసాద్ తండ్రి, రిటైర్డ్ అకౌంట్స్ ఆఫీసర్ వాకా చలపతిరావు (91) శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. పౌర చైతన్య వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు రాఘవ, కార్యదర్శి ఏఎన్ పరమేశ్వర రావు, జిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధర ప్రసాద్, జిల్లా అరసం అధ్యక్షుడు యువశ్రీ మురళి, తెలుగు భాషోద్యమ సమితి కార్యవర్గ సభ్యులు పేరూరు బాలసుబ్రమణ్యం, ఆకుతోట గజేంద్ర చలపతి రావు తదితరులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.